# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023




**రుణాల ఎంపికలో జాప్యం**

మైనార్టీ యువతకు రుణాలు అందని ద్రాక్ష గానే మారాయి. జిల్లా ఆవిర్భావం తర్వాత ఆరు మండలాలకు ఒక్కటీ రాలేదు.


8లో




**మొబైల్ పోయిందా..**

సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ట్రాక్ చేసేందుకు సీఈఐఆర్ పోర్టల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.


10లో


గరిష్టం / కనిష్టం

43° / 24°

**వాతావరణం**

జిల్లాలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోద వుతాయి. మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికం గా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళ వారం కమనీయంగా నిర్వహించారు. తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపం లో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యా వాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధార ణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. మంగళవారాన్ని పురస్కరించుకొని ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

### పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం



పూర్ణాహుతి కార్యక్రమం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మాస శివరాత్రి సందర్భంగా పెద్దమ్మతల్లి ఆలయంలో మంగళవారం రుద్ర హోమం నిర్వహించారు. ముందుగా మేళ తాళాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజ చేసి, రుద్రహోమం, పూర్ణాహుతి జరిపించారు. హాజరైన భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ శర్మ, నర్సింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ మహీ పతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీ రిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి ఆలయంలో మంగళవారం మాస శివ రాత్రిని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఈ సంద ర్భంగా అర్చకులు సత్యనారాయణశర్మ, సాయి స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చన తదితర పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

### మార్ట్‌గేజ్ రుణాలు వచ్చేలా చూడండి

రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శిని కోరిన తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్: ఏజెన్సీ ప్రాంత వాసులకు మార్ట్‌గేజ్ రుణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కోరారు. గండుగులపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం ఏజెన్సీ ప్రాంత రైతులు కలిశారు. గత రెండేళ్లుగా మార్ట్‌గేజ్ రుణాలు రావడం లేదని, దీంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దీంతో తుమ్మల నవీన్ మిట్టల్‌కు ఫోన్ చేసి ఈ సమస్య పరిష్కారం అయ్యేలా కలెక్టర్, డీసీసీబీ అధికారులను ఆదేశించాలని కోరారు. దీనికి నవీన్‌మిట్టల్ సానుకూలంగా స్పందించారు.

# ఇక్కడ ఆటలు సాగడం లేదని!





గత శనివారం కోడి పందేలు ఆడుతున్న దృశ్యం (ఇన్‌సెట్) ఛత్తీస్‌గఢ్‌లోని మారాయిగూడ గ్రామం

**సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో పేకాట క్లబ్బులు, కోడి పందేలు**

- మారాయిగూడ కేంద్రంగా అక్రమ దందా
- గ్రామానికి క్యూ కడుతున్న తెలంగాణ, ఏపీ ఆటగాళ్లు
- తెలంగాణలో పేకాట, ఏపీలో కోడిపందేలపై నిషేధం
- ఆదిలోనే చెక్ పెట్టాలంటున్న బాధిత కుటుంబాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సరదాగా మొదలై, వ్యసనంలా మారి జీవితాలను, కుటుం బాలను ఇబ్బందులపాలు చేసే కోడిపందేలు, పేకాట క్లబ్బులు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన సరదా పురుషులకు వల విసురుతున్నాయి. ఆదిలోనే ఈ విష సంస్కృ తికి అడ్డుకట్ట వేయకపోతే రాబోయే రోజుల్లో ఇబ్బం దులు తప్పవు.

**ఛత్తీస్‌గఢ్‌కు మకాం..**

ఏళ్ల తరబడి సంపాదన కోల్పోయిన పేకాట క్లబ్బు నిర్వాహకులు సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. రెండు రాష్ట్రాల్లో తమ 'ఆటలు' సాగడం లేదని పొరుగు రాష్ట్రంలో అడ్డా ఏర్పాటు చేసుకున్నారు. భద్రాద్రి జిల్లాకు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు సరిహద్దునే ఉంటాయి. దీంతో జిల్లాకు ఉన్న భౌగోళిక పరిస్థితులను అడ్డుగా పెట్టుకుని దందాకు తెరలేపారు. దుమ్ముగూడెం మండల కేంద్రం నుం చి 18 కిలోమీటర్ల దూరంలో ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మారాయిగూడెం అనే గ్రామం ఉంది. ఈ గ్రామా న్ని ఆనుకునే ఆ రాష్ట్రంలో మారాయిగూడ అనే మరో గ్రామం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న మారాయి గూడ కేంద్రంగా కొత్తగా పేకాట క్లబ్ కమ్ కోడి పం దేల కేంద్రం ఇటీవల వెలిసింది. ఈ స్థావరం ఉన్నది పొరుగు రాష్ట్రంలోనే అయినా దీని నిర్వాహ కులు, అక్కడికి వెళ్లే వారిలో 90 శాతం మంది తెలం గాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారే ఉంటు న్నారు. ముఖ్యంగా భద్రాద్రి జిల్లాకు చెందిన సర దా పురుషులపై పేకాట/కోడిపందెం స్థావరం నిర్వాహకులు వల విసురుతున్నారు.

**వారంలో మూడురోజులు..**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మారాయి గూడ కేంద్రంగా ఏర్పాటైన స్థావరంలో ప్రతీ సోమ, బుధ, శనివారాల్లో కోడి పందేలు, పేకాట జోరుగా సాగుతున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా ఆటలు, సయ్యాటలు సాగుతుండడంతో మరుసటి రోజు విశ్రాంతి ఇస్తున్నారు. మారాయిగూడ డెన్ పని చేసే రోజుల్లో ఏపీ, తెలంగాణకు చెందిన సర దా పురుషులు అటు వెళ్తున్నారు. ఆ రోజుల్లో పదుల సంఖ్యలో వాహనాలు కొత్తగూడెం, భద్రాచ లం మీదుగా మారాయిగూడ వైపు రయ్‌రయ్ మం టూ దూసుకెళ్తున్నాయి. ఆదిలో ఈ వ్యవహారం సర దాగానే అనిపించినా.. కొంచెం కోరిక ముదిరితే ఇళ్లు.. ఒళ్లు గుల్ల కావడం తథ్యమనేందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి.

**ఇటీవలే రీ ఓపెన్..**

గతంలోనూ ఈ స్థావరంలో విచ్చలవిడిగా కోడి పం దేలు, పేకాటలు జరిగాయి. దీంతో అనేక కుటుం బాలు ఇబ్బంది పడ్డాయి. చివరకు పోలీసులు, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి పెరడగంతో ఈ డెన్‌ను మూసేశారు. ఆ తర్వాత ఈ ఏడాది ఆరం భంలో సంక్రాంతి పండుగ సందర్భంగా తిరిగి తెర వాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఎన్నో కుటుంబాల జీవితాల్లో చీకటి నింపుతున్న ఈ మారాయిగూడ దందాకు సహకరించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. కానీ మళ్లీ ఏ మాయ మంత్రం వేశారో కానీ గత నెలలో ఈ డెన్‌ను రీ ఓపెన్ చేయించారు.

**తెలుగు రాష్ట్రాల్లో నిషేధంతో..**

పేకాట కారణంగా అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ వ్యసనం బారిన పడి ఆస్తులు, ఆభరణాలు అమ్ముకున్న వారు ప్రతీ గ్రామంలో కనిపిస్తారు. కెరీర్‌లు నాశనం చేసుకున్న వారూ ఎందరో ఉన్నారు. పేకాట తరహాలోనే కోడి పందేల కారణంగా ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయి. తెలంగాణ ఏర్పడగానే 2014లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేకాట క్లబ్బులను మూసేయించారు. పేకాటను నిషేధించారు. రాష్ట్రంలో కోడి పందేలు పెద్దగా లేకపోయినా ఏపీలో జోరుగా సాగేవి. అయితే కాలక్రమం లో ఏపీలో సైతం కోడిపందేలు, పేకాటపై నిషేధం విధించారు. ఇలా రెండు ప్రభుత్వా లు తీసుకున్న గట్టి చర్యల కారణంగా ఎన్నో కుటుంబాల ఆర్థిక పరిస్థితి తిరిగి గాడిన పడింది. మరోవైపు పందెం నిర్వాహకులు, క్లబ్బు ఓనర్లకు అక్రమ సంపాదన లేకుండా పోయింది.

## దోపిడీ శక్తులకు మోడీ అభయం

- బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఇక్కట్లే
- ప్రజాపోరు యాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



పాల్వంచ : మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన సాబీర్‌పాషా

కొత్తగూడెంరూరల్/పాల్వంచ: దేశ సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్న వారికి ప్రధాని నరేం ద్రమోడీ అభయం ఇస్తున్నారని, అదాని, అంబాని లాంటి వారికి ప్రపంచ కుబేరుల జాబితాలో చోటు కల్పిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర మంగళవారం పాల్వం చ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో కొనసాగింది. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేసింద న్నారు. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే పేద, మధ్యతరగతి వర్గాలకు ఇబ్బందులు తప్పవని చెప్పారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను తన చెప్పుచేతుల్లోకి తీసుకుంటోందని ఆరోపించారు. డబ్బు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నీతివంతంగా పాలన సాగిస్తున్న కేజ్రీవాల్‌ను సైతం అనేక కేసు ల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కమ్యూ నిస్టులు అమ్ముడుపోయారని కొందరు ఆరోపిస్తు న్నారని, స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర రావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ కుర్చీల కోసం పార్టీలు మారారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టులకు కంచుకోట అని, జూన్‌లో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించి తమ సత్తా చాటుతామని అన్నారు. కాగా, ఈ యాత్రకు సీపీఎం నాయకులు అన్నవరపు సత్యనారాయణ, దొడ్డా రవికుమార్, రహీం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, కల్లూరి వెంకటేశ్వరరావు, ఏపూరి బ్రహ్మం, వై. శ్రీనివాస్‌రెడ్డి, మున్నా, లక్ష్మీకుమారి, చంద్రగిరి శ్రీనివాస్, సునీల్‌కుమార్, జమలయ్య, కె రత్నకు మారి, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, సాయిబాబు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, బల్ల సాయికుమా ర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**'పోడు'లో తేడా వస్తే పోరు తప్పదు**

టేకులపల్లి/ములకలపల్లి/దమ్మపేట: పోడు పట్టాల పంపిణీలో తేడా వస్తే రాష్ట్ర ప్రభుత్వం పైనా పోరాటం తప్పదని సీపీఐ జిల్లా కార్యద ర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. జిల్లాలో చేప ట్టిన ప్రజాపోరు యాత్ర మంగళవారం టేకుల పల్లి, ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక కార్యకలాపా లు చేపడితే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధా నాలను ప్రజలకు వివరించేందుకే తమ యాత్ర సాగుతోందని చెప్పారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జిల్లాలో 2,99,745 ఎకరాలకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టేకులపల్లి సభలో బీఆర్‌ఎస్ మండల అధ్య క్షుడు బి.వరప్రసాద్, ములకలపల్లిలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, వాసవీక్లబ్ అధ్యక్షుడు బిక్కుమళ్ల సుధాకర్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నరాటి ప్రసాద్, గుగులోత్ రాం చందర్, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఐలయ్య, రవీందర్, మండల కార్య దర్శి ఎండీ.యూసఫ్, వీరూనాయక్, నరాటి రమేశ్ తదతరులు పాల్గొన్నారు.

### ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

టేకులపల్లి: ఆయిల్ పామ్ సాగుతో ఆశించిన మేరకు ఆదాయం వస్తుందని జిల్లా పట్టు, ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని సంప త్‌నగర్, గంగారం, కొప్పురాయి గ్రామాల్లో రాష్ట్ర ఆయిల్ పామ్ గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మామిడి తోటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు ఉత్తమమని అన్నారు. మామిడి తోటలకు సరైన సమయంలో కాత, పూత రాక, చీడ పీడలు, నూతన రకాల నల్లతామర పురుగులు ఆశిం చడం, గాలి, దుమ్ము తదితర ఇబ్బందులు తలెత్తుతు న్నాయని చెప్పారు. వరి సాగుకు నీరు అధికంగా అవసరం అవుతుందని తెలిపారు. పామాయిల్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, ఆశించిన మేరకు ఆయిల్‌పామ్ సాగు లేక విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పలు రాయి తీలు ఇస్తోందన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతరపం టలు కూడా సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ మండల అధికారులు కె.సందీప్, శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఇప్పటికే అనుమతి మంజూరు చేసిన ఎన్ ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) తాజాగా 2023–24 విద్యాసంవత్సరంలో వంద సీట్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఎన్ ఎంసీ అధికారులు లేఖ విడుదల చేశారు. కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ విద్యార్థులను చేర్చుకునే సమయంలో ఐఎంసీ యాక్ట్ సెక్షన్ 35(2) ప్రకారం వారి విద్యార్హతలను పరిశీలించాలని అందులో సూచించారు. అలాగే ఎన్‌ఎంసీ నిబంధనలను తప్పక పాటించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణం గా మౌలిక సదుపాయాలు కల్పించాలని, టీచింగ్ ఫ్యాకల్టీ, క్లినికల్ మెటీరియల్‌ను విద్యాసంవత్సరానికి సరిపడా సమకూర్చుకోవాలని సూచించడమే కాక ఏదైనా తప్పుడు సమాచారం ఇస్తే బాధ్యత వహిం చాల్సి ఉంటుందని ఎన్‌ఎంసీ హెచ్చరించింది.

## అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే హరిప్రియ వినతి



మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డితో ఎమ్మెల్యే

ఇల్లెందు: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ ఆర్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మం గళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణి కార్మికుల సమస్యలను మంత్రికి వివరించడంతో పాటు మున్సిపాలిటీ, నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మం జూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, టీజీబీకేఎస్ ఉపా ధ్యక్షుడు రంగనాథ్, నాయకులు కోటిరెడ్డి, జెడ్పీటీ సీ ఉమాదేవి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు లాల్‌సింగ్, చీమల సత్య నారాయణ పాల్గొన్నారు.

## న్యాయ సహాయ కేంద్రాల ఏర్పాటు

కొత్తగూడెంరూరల్: రైతులకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత న్యాయ సాయం అం దించేందుకు ఈనెల 21న న్యాయ సహాయ కేం ద్రాలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడు దల చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు, భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం, మణుగూరు, పర్ణశాలల్లో ఈ కేంద్రాలు ప్రారంభిస్తామని వివరిం చారు. పంట సాగు మొదలు పెట్టినప్పటి నుంచి ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకునేంత వరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిం చేందుకే ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భూ సమస్యలు ఎదురైనా, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వల్ల నష్టం వాటిల్లినా, పంటల బీమా అమలు కాకపోయినా, మార్కెట్‌లో మోసం జరిగినా రైతులు న్యాయ సహాయ కేంద్రా లను ఆశ్రయించవచ్చని వివరించారు.

## ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్

- పలు విధ్వంస ఘటనలతో సంబంధం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వినీత్



మావోయిస్టుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ డాక్టర్ వినీత్

సింగరేణి(కొత్తగూడెం): భద్రాచలం శివార్లలో మం గళవారం 81, 141 బెటాలియన్ల సీఆర్పీఎఫ్ సిబ్బం ది చేపట్టి తనిఖీల్లో ఇద్దరు మావోయిస్టులు పట్టు బడ్డారు. ఈ మేరకు కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డాక్టర్ జి.వినీత్ వివ రాలు వెల్లడించారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది వాహ నాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదం గా కనిపించారని, వారిని అదుపులోకి తీసుకుని విచారించగా మావోయిస్టు పార్టీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వెస్ట్ బస్తర్ జిల్లా దర్భా డివిజన్ ఏసీఎం కమాండర్ కుంజం ఉంగల్ అలియాస్ ప్రదీప్ అలియాస్ విజ్జల్, డిప్యూటీ కమాండర్ మూషిక రాజీగా తేలిం దని ఎస్పీ తెలిపారు. ఉంగల్ 2008లో గాదెరాజు వద్ద ఇద్దరు నాగా పోలీసులను చంపి, తుపాకు లను ఎత్తికెళ్లిన ఘటనలో ప్రధాన నిందితుడని చెప్పారు. అలాగే, 2009లో సీఆర్పీఎఫ్ జవాన్లను హతమార్చి ఆయుధాలను ఎత్తుకెళ్లిన బృందంలో కూడా ఉన్నాడని తెలిపారు. 2010లో గట్టు ప్రాం తంలో జరిగిన పేలుడు ఘటనలో పది మంది సీఆర్పీఎఫ్ జవాన్లు చనిపోగా అందులో కూడా ఉం గల్ పాల్గొన్నాడని, 2014లో బోంగ్సాల్ వద్ద అం బుష్ వేసి 14 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు హతమా ర్చిన ఘటనలో ప్రధాన నిందితుడని, 2015లో కట్టే కళ్యాన్ సంతలో ఒక హవల్దార్‌ను కూడా మత్యా చేశాడని వెల్లడించారు. ఇక మూషిక రాజీ 2010లో మహిళా బాలల కమిటీలో సభ్యురాలిగా చేరి 2018లో మద్దం గ్రామంలో పోలీసులపై కాల్పులు తదితర ఘటనల్లో ప్రధాన పాత్ర పోషించిందని వివరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఓఎస్డీ సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, 81, 141 బెటాలియన్ కమాండెంట్లు సం జీవ్‌కుమార్, ప్రశాంత్‌ధర్, భద్రాచలం సీఐ నాగ రాజురెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వనానికి రాష్ట్రస్థాయి అవార్డు

పురస్కారం అందుకున్న నారాయణరావుపేట సర్పంచ్, కార్యదర్శి



మంత్రి నిరంజన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

పాల్వంచరూరల్ : మండలంలోని నారాయణరావు పేట ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనానికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు దక్కింది. 2001లో ఇక్కడ నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో ఇటీవల కలెక్టర్ అను దీప్ పరిశీలించి ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అవార్డు ప్రకటించ గా, గ్రామ సర్పంచ్ గుర్రం రాజశేఖర్, కార్యదర్శి బెజ్జంకి రాజు సోమవారం హైదరాబాద్‌లో వ్యవ సాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. కాగా, స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంపీఓ బి.నారాయణ సర్పంచ్, కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ మాట్లాడుతూ.. పంచాయతీలో సమష్టి కృషి ఫలితం గానే ఈ అవార్డు దక్కిందని హర్షం వ్యక్తం చేశారు.

## బండారుగూడెం పాఠశాలకు అరుదైన గుర్తింపు

అంతర్జాతీయ యూనిసెఫ్ బుక్‌లో స్థానం



పాఠశాల హెచ్‌ఎంను అభినందిస్తున్న యూనిసెఫ్ ప్రతినిధి

దుమ్ముగూడెం: యూనిసెఫ్‌లోని సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ ఏడాది ప్రచురితమయ్యే పుస్తకం లో 'క్లీన్ అండ్ గ్రీన్ అండ్ ఎకో ఫ్రెండ్లీ ప్రాక్టీసెస్' విభాగంలో మండలంలోని బండారుగూడెం యూపీఎస్‌కు స్థానం దక్కింది. ఈ మేరకు యూనిసెఫ్ ప్రతినిధి శ్రేయస్ సజీవన్ మంగళ వారం బండారుగూడెం పాఠశాలను సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బండారుగూడెం పాఠశాలకే ఈ అవ కాశం దక్కిందన్నారు. పాఠశాల స్థితిగతులను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదం డ్రులు, సర్పంచ్, విద్యాకమిటీ చైర్మన్‌తో సమావే శమై సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఈ నివే దికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు బెక్కంటి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కాటిబోయిన చిన వెంకటేశ్వర్లు, విద్యాకమిటీ చైర్మన్ కుంజా నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఏవీ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## 'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష



వృద్ధురాలి కంటి అద్దాలను పరిశీలిస్తున్న శిరీష

అన్నపురెడ్డిపల్లి : జిల్లాలో ప్రతి మంగళవారం నిర్వ హించే ఆరోగ్య మహిళా క్లినిక్‌లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. మం డలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని మంగళవారం ఆమె పరిశీలించారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌లో అం దిస్తున్న వైద్య సేవల గురించి మండల వైద్యాధికారి ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు షుగర్, బీపీ, కేన్సర్ వంటి వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పెంట్లం గ్రామంలోని కం టి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటి వెలుగు శిబిరంలో రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని, అవసరమైన వారికి కంటి అద్దాలు అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పెంట్లం, ఎర్రగుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ప్రీస్కూల్ పిల్లలకు అందించే పోషకాహారాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, చండ్రుగొండ సీడీపీఓ నిర్మలాజ్యోతి, డాక్టర్ తన్మయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

## పాలేరుకు జలకళ!



మండు వేసవిలోనూ మండలంలోని పాలేరు రిజర్వాయర్ నిండుకుండలా కళకళలాడుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా మంగళ వారానికి 22.65 అడుగులకు చేరి జలకళ సంతరించుకుం ది. రిజర్వాయర్ నిండుగా ఉండటంతో పర్యాటకులను ఆక ట్టుకుంటోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌కు సాగర్ జలాశయం నుంచి 4,005 క్యూసెక్కుల నీరు చేరుతుండగా రిజర్వా యర్ నుండి జిల్లాలోని ఆయకట్టుకు 3,460 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే, పాలేరు కాల్వకు మరో 210 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. – కూసుమంచి

## క్లుప్తంగా

### ఖమ్మం సీపీని కలిసిన జీఎం


సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం

ఇల్లెందు: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో ఈ నెల 29న పర్యావరణ అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ సభ జరగనుంది. ఈ మేరకు ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌ను ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం షాలేము రాజు మంగళవారం కలిసి మాట్లాడారు. 21 ఇంక్లయిన్ భూగర్భగనిని ఓసీగా మార్చడం, జేకేటీసీ-5 విలీనం తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పిన ఆయన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

### వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి..


కమిషనర్ అంకుషావలితో చర్చిస్తున్న అసమ్మతి కౌన్సిలర్‌లు

ఇల్లెందు: అసమ్మతి ముద్ర పడిన కౌన్సిలర్‌లు మంగళవారం మున్సిపల్ కమిషనర్ అంకుషావలిని కలిసి తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా వార్డుల్లో తాగునీరు అందించాలని, లైట్లు పెట్టాలని, కాలువలను శుభ్రం చేయాలని కోరారు. మెయిన్‌రోడ్ మీద పెరిగిన చెట్లు విద్యుత్ తీగలను తాకుతున్నాయని, వాటిని తొలగించాలన్నారు. పట్టణంలోని 6వ వార్డులో గల మంచినీటి బోర్లు మరమ్మత్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు తోట లలితాశారద, పాబోలు స్వాతి, చీమల సుజాత, వాంకుడోతు తార, స్థానికులు సామల రవితేజ, పాబోలు కిరణ్, కావటి రమేశ్ పాల్గొన్నారు.

### అదుపుతప్పి వ్యాన్ బోల్తా

ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు


ప్రమాదానికి గురైన వ్యాన్

జూలూరుపాడు: స్థానిక పత్తి సబ్ మార్కెట్ యార్డు సమీపంలో తల్లాడ - కొత్తగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడగా ఇద్దరు మహిళలు గాయపడ్డారు. మోతె మండలం ఉర్రిగొండ గ్రామానికి చెందిన ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఈకో వ్యాన్‌లో బయలుదేరి పాల్వంచలో బంధువుల అమ్మాయి చనిపోతే ఆమె అంత్యక్రియలకు వెళుతున్నారు. ఈ క్రమంలో జూలూరుపాడు పత్తి సబ్ మార్కెట్ యార్డు సమీపంలోకి రాగానే వ్యాన్ వెనక టైరు పగలడంతో అదుపుతప్పి పల్టీ కొట్టింది. గమనించిన వినోభానగర్ రైతులు, వాహనదారులు, స్థానికులు వ్యాన్‌లో చిక్కుకున్న వారందరినీ బయటకు తీశారు. పానుగంటి చరవమ్మ మోకాలుకు తీవ్ర గాయం కాగా, మండవ రమణ ఎడమ భుజం విరిగింది. వ్యాన్ డ్రైవర్‌తోపాటు మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం..


ఇంట్లోని సామగ్రి దగ్ధమైన దృశ్యం

గుండాల: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి కాలిపోయిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కాచనపల్లి గ్రామానికి చెందిన ఊకె శంకరమ్మ స్థానిక ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తోంది. ఉదయాన్నే పని నిమిత్తం పాఠశాలకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లోని సామగ్రితోపాటు రూ.80 వేలు నగదు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఇది చూసిన బాధితురాలు బోరునవిలపించింది.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దుమ్ముగూడెం: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో సీఐ దోమల రమేశ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు అటుగా రావడంతో సీఐ అనుమతి పత్రాలు అడగగా వారి వద్ద లేవు. వెంటనే ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.13,943 |

# రుణాల ఎంపికలో జాప్యం

- రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఇబ్బందులు
- జిల్లా ఏర్పడిన నాటి నుంచి తొలి నోటిఫికేషన్
- జిల్లాకు కేవలం 140 యూనిట్లే..


జిల్లా మైనార్టీ కార్యాలయం ఇదే

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత మైనార్టీ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోసం తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. జిల్లాకు కేవలం 140 యూనిట్‌లు మాత్రమే కేటాయించింది. మొదటి విడత 70, రెండో విడత 70 యూనిట్‌లు కేటాయించారు. జిల్లాలోని 23 మండాలలోని ఆళ్లపల్లి, పినపాక, కరకగూడెం, గుండాల, టేకులపల్లి, దుమ్ముగూడెం గ్రామాలకు యూనిట్‌లు కేటాయించలేదు. మిగతా అన్ని మండలాలకు కేటాయించారు. రుణాల ఎంపిక ప్రకియ బాధ్యతను మున్సిపాలిటీలలో కమిషనర్‌లకు, మండలాలలో ఎంపీడీఓలకు అప్పగించారు. దీంతో రాజకీయ నాయకుల పైరవీలు ఎక్కువయ్యాయని సమాచారం. ఫలితంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం అధికారులకు కష్టంగా మారింది. గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా జిల్లాలో మైనార్టీలకు రుణాల నోటిఫికేషన్ జారీ చేశారు. కేటగిరి-1 కింద 49 యూనిట్‌లు, కెటగిరి-2 కింద 21 యూనిట్‌లు వచ్చాయి. వీటికిగాను 68.60 లక్షలు కేటాయించారు. కెటగిరి-1 కింద రూ. లక్ష రుణం కాగా.. రూ.80 వేలు సబ్సిడీ రాగా, రూ.20 వేలు లబ్ధిదారుల వాటా ఉంటుంది. కేటగిరి-2 కింద రూ.రెండు లక్షల రుణానికి గాను రూ.1.40 లక్షలు సబ్సిడీ కాగా.. రూ.60 వేలు లబ్ధిదారుడి వాటా ఉంటుంది. ఈ రుణాలకు డిసెంబర్ 17 నుంచి ఆన్‌లైన్‌లో జిల్లా నుంచి 3,377 మంది దరఖాస్తు చేస్తున్నారు.

**జిల్లాలో ఒక్కొక్క యూనిట్‌లు ఇవే..**

జిల్లాలోని దమ్మపేట-1, ములకలపల్లి-1, అన్నపురెడ్డిపల్లి-1, చర్ల-1, జూలురుపాడు-1, సుజాతనగర్-1, లక్ష్మీదేవిపల్లి-1, మణుగూర్-1, అశ్వాపురం-1, ఇల్లెందు-1 యూనిట్‌లు కేటాయించారు. జిల్లాలోని మున్సిపాలిటీలో మణుగూరు కేటగిరి-1 కింద రూ.3 లక్షలు యూనిట్, కేటగిరి-2 కింద రూ.2 లక్షల రూపాయాల రెండు యూనిట్లు ఉన్నాయి. పాల్వంచ-7, ఇల్లెందు-7, కొత్తగూడెం-8 యూనిట్‌లు ఉన్నాయి. జిల్లాలోని ఈ నాలుగు మున్సిపాలిటీలకు కేటాయించిన రుణాలకే ఇంటర్వ్యూలు నిర్వహించారు. కానీ, మండలాలలో రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించలేదని దరఖాస్తు దారులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన రుణాల కేటాయింపులో యాక్షన్ ప్లాన్ అధికారులు సక్రమంగా చేయకపోవడం వల్ల మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు అందని దాక్షగానే మారాయి. రెండో దఫాలో జిల్లాకు మరో 70 యూనిట్‌లు అదనంగా మంజూరు చేశారు. వీటికిగాను రూ.68.60 లక్షలు బడ్జెట్ కేటాయించారు. మొదటి విడత రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారిలో నుంచే 70 మంది ఎంపిక చేసి రుణాలు ఇస్తారు. కానీ, ఈ ఎంపిక ప్రకియ గందరగోళంగా మారింది. అదనంగా మంజూరైన 70 యూనిట్‌లు ఎవరికి కేటాయిస్తారోననే ఆందోళన లబ్ధిదారుల్లో కనిపిస్తోంది. కాగా, జిల్లాలోని 2011 జనాభా లెక్కల ప్రకారం మైనార్టీలు 63,486 మంది ఉన్నారు. ఈ ప్రాతిపదికన రుణాల కేటాయింపు జరగడం లేదని సమాచారం. ప్రస్తుతం ఆళ్లపల్లి, గుండాల, కరకగూడెం, టేకులపల్లి, దుమ్ముగూడెం, పినపాక మండలాలకు ఒక్క యూనిట్ కూడా కేటాయించలేదు. నోటిఫికేషన్‌లో ఈ మండలాలకు చెందిన వారు రుణాలకు దరఖాస్తు చేసుకోవద్దని అధికారులు చెప్పలేదు. దీంతో ఈ మండలాలకు చెందిన మైనార్టీలు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రెండో దఫా మంజూరైన 70 యూనిట్‌లను అంతకు ముందు కేటాయించని మండలాల్లోని వారికి అందించాలని పలువురు కోరుతున్నారు.

**జనాభా ప్రాతిపదికన రుణాలివ్వాలి**



ఆరేళ్ల తరువాత రుణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. 2016 నుంచి 2022 వరకు రుణాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. జనాభా ప్రాతిపదికన రుణాలు మంజూరు చేయాలి. జిల్లాలో కొన్ని మండలాలకు ఒక్క యూనిట్ కేటాయించలేదు. మైనార్టీలకు సమన్యాయంగా యూనిట్‌లు కేటాయించాలి.

– ఎండీ యాకూబ్‌పాషా, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

## అవకాశాలను వినియోగించుకోండి..


మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజు

ఇల్లెందురూరల్: నిరుద్యోగ యువత అందివచ్చిన ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజు సూచించారు. మండలంలోని వైటీసీ భవన్‌లో మంగళవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ ద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో యువతకు వృత్తిపరమైన శిక్షణలో నైపుణ్యం పెంచడంతోపాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. వివిధ ప్రాంతాలకు చెందిన కంపెనీలతో ఐటీడీఏ జాబ్స్ విభాగం నిరంతరం సత్సంబంధాలు నెరుపుతూ ఉపాధి అవకాశాలు ఏజెన్సీ యువతకు ఇచ్చేలా కృషి చేస్తోందని వివరించారు. యువత విద్యార్హతను బట్టి వివిధ కంపెనీల యజమానులు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరవ్వాలని పేర్కొన్నారు. అనంతరం పలు కంపెనీలకు చెందిన అధికారులు యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వైటీసీ ఇన్‌చార్జ్ అనసూర్య, సిబ్బంది రామకృష్ణ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలను సందర్శించిన వ్యవసాయ విద్యార్థులు


వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక పామాయిల్, పాల్వంచలోని విద్యుత్ థర్మల్ కేంద్రం (కేటీపీఎస్) పరిశ్రమలను మంగళవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. కాగా, పామాయిల్ ఫ్యాక్టరీలో మేనేజర్ ఆకుల బాలకృష్ణ ఆధ్వర్యంలో పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం, నివారణ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యాన్ని నివారించేందుకు పటిష్టమైన చర్యలుంటాయని, వాటి వల్ల వాతావరణానికి తక్కువ నష్టం కలుగుతుందని, వ్యవసాయ అనుబంధ రంగాలు అభివృద్ధి చెందడంతోపాటు రైతులకు మేలు కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్, తృతీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## బెటాలియన్‌లో యోగా శిక్షణ


యోగా శిక్షణ పొందుతున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శ్రీరామ చంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ ఆధ్వర్యాన మంగళవారం యోగా శిక్షణ ఏర్పాటుచేశారు. శిక్షణను బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా ప్రారంభించి మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యం దరి చేరుతుందని తెలిపారు. సహాయ దళాధిపతి ఎం.ఉదయ్ భాస్కర్‌రావు, రామచంద్ర మిషన్ సభ్యులు కే.పీ.రెడ్డి, రమణ, శ్రీనివాసరెడ్డి, రోశయ్య, మనస్విని, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీ..

- పదిమందికి గాయాలు
- బస్సు అత్యవసర ద్వారం నుంచి ప్రయాణికులు బయటకు


ఆర్‌టీసీ బస్సు, డీసీఎం వాహనం ఢీకొన్న దృశ్యం

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామ సమీపంలో పెద్ద కాలువ వద్ద మణుగూరు - కొత్తగూడెం ప్రధాన రహదారిపై మంగళవారం ఆర్‌టీసీ బస్సు, డీసీఎం ఢీకొని పదిమందికి గాయాలయ్యాయి. మణుగూరు నుంచి 30 మంది ప్రయాణికులతో ఖమ్మం వెళుతున్న బస్సు.. మొండికుంట గ్రామ సమీపంలో డీసీఎంను ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న పది మంది గాయపడ్డారు. అందులో నలుగురుకి తీవ్ర గాయాలు కాగా, బస్సు డ్రైవర్ కృష్ణతో పాటు మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద కాలువ వంతెన వద్ద ప్రమాదం జరగడం.. కాలువలో బస్సు పడకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియరాలేదు. కాగా, బస్సు, డీసీఎం ముందు భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. అశ్వాపురం నుంచి వెళ్తున్న కాంగ్రెస్ నాయకుడు బట్టా విజయ్‌గాంధీ, స్థానికులు బస్సులోని క్షతగాత్రులను అత్యవసర ద్వారం తెరిచి బయటకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ జితేందర్ హుటాహుటిన ప్రమాద స్థలికి చేరుకొని అంబులెన్స్ ఆలస్యం కావడంతో పోలీస్ వాహనంలో నలుగురు క్షతగాత్రులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. 108 వాహనంలో మరికొందరిని ఆసుపత్రికి తరలించారు. తహసీల్దార్ ఎంఏ రాజు, ఆర్‌ఐలు రాజేశ్వరరావు, నాగమణి ప్రమాద స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అయితే, పెద్ద కాలువ వంతెన వద్ద ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం వంతెన వద్ద రహదారి గుంతలమయం కావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

### బీజాపూర్ ఎమ్మెల్యే కాన్వాయ్‌పై కాల్పులు

త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడిన విక్రమ్ మాండవి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి కాన్వాయ్‌పై మావోయిస్టులు మంగళవారం కాల్పులు జరిపారు. అయితే ఆయన ప్రయాణిస్తున్న కారు అప్పటికే ముందుకు వెళ్లగా.. మరో కారు టైర్‌కు బుల్లెట్లు తగిలాయి. ఎమ్మెల్యే విక్రమ్ మాండవి జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జిల్లాలోని గంగులూరులో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలోని పడేద గ్రామ సమీపంలో కాన్వాయ్‌పైకి మావోయిస్టులు కాల్పులు జరిపారు. అప్పటికే ఎమ్మెల్యే కారు ముందుకెళ్లగా జిల్లా పంచాయతీ సభ్యురాలు పార్వతి కశ్యప్ ప్రయాణిస్తున్న కారు టైర్‌కు రెండు బుల్లెట్లు తగిలాయి. అయినా డ్రైవర్ ఆపకుండా అలాగే కారును ముందుకు తీసుకెళ్లడంతో మావోల నుంచి ప్రమాదం తప్పినట్లయింది. ఎమ్మెల్యే పర్యటన వివరాలు ముందుగా తెలుసుకున్న మావోయిస్టులు తిరుగు ప్రయాణంలో ఆయనపై దాడి చేయాలనే లక్ష్యంతో అక్కడే కాపు కాశారని సమాచారం.

### 'వందే భారత్' ప్రజల ఆస్తి


బోనకల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోనకల్: వందేభారత్ రైలు ప్రజల ఆస్తి అని.. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైల్వే శాఖ అధికారి శేఖర్ ముకుంద్ నాయక్ తెలిపారు. ఇటీవల వందేభారత్ రైలుపై రాళ్ల దాడులు జరుగుతున్న నేపథ్యాన ట్రాక్ వెంట ఉన్న ప్రాంతాల ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో శేఖర్ మాట్లాడారు. ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేరేందుకు ఏర్పాటుచేసిన వందేభారత్ రైలుపై రాళ్లు వేస్తుండడంతో ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై పి.శ్రీనివాసరావు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

## కాంటా వేసిన 30బస్తాల ధాన్యం చోరీ

నేలకొండపల్లి: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను అమ్మకానికి సిద్ధం చేసిన రైతులు.. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చొచ్చని భావిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యాన్ని చోరీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పైనంపల్లికి చెందిన రైతు బీమాల నారాయణ వరి సాగు చేయగా, ధాన్యాన్ని రామచంద్రాపురం రహదారి వెంట ఆరబెట్టారు. ఈమేరకు సోమవారం సాయంత్రం 30 క్వింటాళ్లను స్థానిక వ్యాపారికి విక్రయించగా, కాంటా పూర్తయ్యాక చీకటి పడడంతో ఇంటికి వెళ్లారు. మంగళవారం ధాన్యం డబ్బులు వస్తాయని సంతోషిస్తుండగా, తెల్లారేసరికల్లా ధాన్యాన్ని దుండగులు చోరీ చేశారు. దీంతో రైతు కుటుంబం ఏం చేయాలో పాలుపోక కన్నీరుమున్నీరవుతోంది.

## ఐదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన వృద్ధుడు

జూలూరుపాడు: ఐదేళ్ల బాలికపై ఓ వృద్ధుడు లైంగికదాడికి యత్నించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలిక తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలానికి చెందిన దంపతులు తమ ఐదేళ్ల కూతురితో కలిసి బతుకుదెరువు కోసం జూలూరుపాడు మండలంలోని ఓ గ్రామానికి రెండేళ్ల కిందట వచ్చారు. ఆ గ్రామంలో ఓ ఇంట్లో ఉంటూ దంపతులు కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 16వ తేదీన బాలిక ఆడుకుంటూ ఇంటి ముందు ఉన్న పాఠశాలలోకి వెళ్లింది. బాలిక పాఠశాలలోకి వెళ్లడాన్ని వృద్ధుడు గమనించాడు. ఆదివారం కావడంతో పాఠశాలలో ఎవరూ లేకపోవడాన్ని గుర్తించిన వృద్ధుడు బాలిక చెయ్యి పట్టుకొని బాత్‌రూంలోకి తీసుకెళ్లాడు. లైంగికదాడికి యత్నించడంతో చిన్నారి పెద్దగా కేకలు వేయడంతో అతను వదిలేయడంతో ఇంటికి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని బాలిక తన తల్లికి చెప్పింది కానీ భర్తకు తెలిస్తే గొడవలు అవుతాయని ఆమె బయటకు చెప్పలేదు. మంగళవారం బాలికను తండ్రి పాఠశాలకు తీసుకెళ్లాడు. పాఠశాలలో ఉన్న వృద్ధుడిని చూసిన బాలిక భయంతో వణికిపోయింది. కూతురిని ఎందుకు భయపడుతున్నావని తండ్రి అడగడంతో జరిగిన విషయాన్ని బాలిక చెప్పింది. బాలిక తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పోలీసులను వివరణ కోరగా వివరాలు చెప్పేందుకు విముఖత వ్యక్తం చేశారు.

### నా ప్రేమికుడి జాడ కనుక్కోండి..

భద్రాచలంఅర్బన్: ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఓ యువతిని మోసం చేసి పరారైన యువకుడి ఉదంతం ఇది.. బాధితురాలి కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కవిత యుబీ రోడ్డులోని ఓ దుకాణంలో పనిచేస్తోంది. పక్కనే ఉన్న మరో దుకాణంలో పనిచేస్తున్న ఏటూరునాగారం మండలం.. చల్లపాక గ్రామానికి చెందిన వినీత్ (విక్కీ) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. శారీరకంగా లోబర్చుకున్నాడు. తర్వాత పెళ్లిచేసుకోనని దబాయించాడు. కాగా, వారి ప్రేమ విషయం కవిత ఇంట్లో తెలిసి కుటుంబ సభ్యులు ఆమెను ఇంటి నుంచి బయటకు పంపించేశారు. ఈ నెల 12న మసీద్ సెంటర్లో అద్దెకు ఉంటున్న వినీత్ ఇంట్లో ఇద్దరూ ఉన్నారు. తెల్లారేసరికి వినీత్ అక్కడి నుంచి పరారయ్యాడని, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసినట్లు యువతి పేర్కొంది. ఈ నెల 13న కవిత భద్రాచలం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని, వారంరోజులు గడుస్తున్నా.. వినీత్ ఆచూకీ తెలియడం లేదని, ఎలాగైనా వినీత్ ఆచూకీ తెలుసుకోవాలని కవిత కోరింది.

### కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. స్థానిక హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురంకాలనీకి చెందిన గుంజా మురళి, భార్య మధ్య కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన జక్కుల చిన్ని అనే వ్యక్తి మురళి, ఇతని తల్లి, తమ్ముడిని దుర్భాషలాడి, వారిపై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు మురళి చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో జక్కుల చిన్నిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బైక్

కరకగూడెం: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురికి గాయాలైన ఘటన మండలంంలోని కలవలనాగారం మూలమలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అశ్వాపురంపాడు గ్రామానికి చెందిన భీమరాజు తన ఇద్దరు కుమారులను మంగళవారం మణుగూరు హాస్టల్ నుంచి తీసుకుని వస్తున్న క్రమంలో కలవలనాగారం మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో ముగ్గురూ కింద పడటంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 ద్వారా కరకగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# వ్యక్తి మృతితో ఆందోళన

న్యూట్రీషన్ మందే కారణమని ఆరోపణ


లక్కా (ఫైల్)

సుజాతనగర్: మండలంలోని సీతంపేట బంజర గ్రామానికి చెందిన భూక్యా లక్కా(44) మంగళవారం మృతి చెందగా ఆయన మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సీతంపేట బంజరకు చెందిన లక్కా మూడేళ్లుగా షుగర్, బీపీతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలోనే సుజాతనగర్‌లో మీ సేవా కేంద్రం నడిపే వంగవీటి కిరణ్ ఓ కంపెనీకి చెందిన న్యూట్రీషన్ మందులు ఇస్తుండటంతో లక్కా మంగళవారం వెళ్లాడు. అక్కడ కిరణ్ ఇచ్చిన పొడిని వేడి నీటిలో కలుపుకొని తాగాక కాసేపు విశ్రాంతి తీసుకుని నీరసంగా ఉందంటూ ఇంటికి వెళ్లాడు. ఇంట్లో నిద్రించిన ఆయనను కాసేపటి తర్వాత భార్య బుజ్జి ఎంత లేపినా స్పందన లేకపోవడంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, కిరణ్ ఇచ్చిన పొడి తాగడమే లక్కా మృతికి కారణమంటూ సుజాతనగర్‌లో కిరణ్ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం తరలించగా, లక్కా కుమారుడు పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, లక్కా భార్య బుజ్జి మూడేళ్ల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికాగా ఆమెకు చికిత్స చేయించి కాపాడుకున్నాడు. కానీ ఇప్పుడు ఆయన మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

### యువకుడి ఆత్మహత్య

దమ్మపేట: మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మల్లారం గ్రామ శివారులోని జీడిమామిడితోటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ సోయం రమేశ్ (36) మద్యానికి బానిసై కుటుంబ పోషణను పట్టించుకోకుండా వదిలేశాడు. దీంతో విసుగు చెందిన అతడి భార్య సోయం పోతమ్మ మందలించింది. భార్య మందలింపునకు మనస్తాపానికి గురై మల్లారం గ్రామ శివారులోని జీడిమామిడి తోటలో పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## నాగులవంచలో పట్టపగలే చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చింతకాని: మండలంలోని నాగులవంచలో బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పరిటాల వీరాంజనేయులు కుటుంబసభ్యులతో సహా పొలం పనులకు వెళ్లగా దుండగులు ఇంటి వెనక తలుపుల తాళాలు పగులగొట్టి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాలో భద్రపర్చిన రూ.4,800 నగదుతో పాటు రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. పొలం నుంచి వచ్చిన వీరాంజనేయులు తలుపులు తెరిచి ఉండటంతో బీరువాలో పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై పొదిల వెంకన్న పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

### సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం సాగర్ కాల్వ లాకుల వద్ద మంగళవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఖమ్మం రమణగుట్టకు చెందిన మణికుమార్ (30) కరుణగిరి సమీపంలో ఉన్న సాగర్ కాల్వలో ఈత కోసం దిగాడు. అయితే, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆయన కొట్టుకుపోయాడు. స్థానికుల నుంచి అందిన సమాచారంతో పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించినా రాత్రి పొద్దుపోయే వరకు ఆచూకీ తెలియరాలేదు.

## క్లుప్తంగా...

### విప్లవోద్యమం సజీవంగా ఉంటుంది

**సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న**

**సిరిసిల్ల/చంచల్‌గూడ:** తెలంగాణలో ప్రస్తుతం విప్లవోద్యమం బలహీనపడినా.. అది నిరంతరం సజీవంగానే ఉంటుందని, అది మళ్లీ ఎగసిపడుతుందని సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అన్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించే రాజ్యం తమను వెంటాడుతోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఓ హత్య కేసులో అరెస్టయిన రాజన్న కొన్ని నెలలుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం ఆయన సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. దిద్దుబాటు కేంద్రాలుగా ఉండాల్సిన జైలులో మానవహక్కుల హననం జరుగుతోందన్నారు. అండర్ ట్రయల్‌లో ఉన్న వారికి అనారోగ్య సమస్యలు వస్తే, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో రాజన్న సోదరుడు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క తదితరులు పాల్గొన్నారు. కాగా, సుద్దాల మాజీ సర్పంచ్ ఏనుగు వేణుగోపాల్‌రావు అలియాస్ ప్రభాకర్‌రావు హత్య కేసులో నిందితుడిగా ఉన్న విశ్వనాథ్‌కు బెయిల్ ఇచ్చేందుకు జిల్లా కోర్టు నిరాకరించింది. దీంతో ఆయనను సిరిసిల్ల నుంచి మళ్లీ జైలుకు తీసుకెళ్లారు.

### నకిలీ బిల్లులపై విచారణ

**ఖమ్మం వినాయక ఆస్పత్రిలో తనిఖీ**

**ఖమ్మం వైద్యవిభాగం:** సీఎం సహాయనిధి నుంచి పరిహారం పొందేందుకు వైద్యం చేయకుండానే.. చేసినట్లు తప్పుడు బిల్లులు ఇచ్చారనే ఆరోపణలతో ఖమ్మంలోని శ్రీ వినాయక సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో హైదరాబాద్ పోలీసులు తనిఖీలు చేట్టారు. సచివాలయం ఉద్యోగి డీఎస్ఎన్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆస్పత్రి నిర్వాహకులతోపాటు బిల్లులు సమర్పించిన శివపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సీసీఎస్ సీఐ మల్లికార్జున్ ఆధ్వర్యాన పోలీసులతోపాటు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రాంబాబు తనిఖీలు చేపట్టారు. నల్లగొండ జిల్లా చలకుర్తికి చెందిన రమావత్ శివ ఈ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,55,854 బిల్లు తీసుకున్నాడు. ఆయన వినాయక ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్ రమేష్ వద్ద వైద్యం చేయించుకున్నట్లు బిల్లుల్లో ఉంది. అయితే, అలాంటి వైద్యుడెవరూ తమ వద్ద లేరని నిర్వాహకులు చెప్పడంతో పోలీసులు రికార్డులు తనిఖీ చేశారు.

# బంగారు ఇళ్లు ఎక్కడ?

**గ్రామాల్లో నాకన్నీ గుడిసెలే కన్పిస్తున్నాయి: సీఎల్పీ నేత భట్టి ఎద్దేవా**

- ఒక్క కేసీఆర్ కుటుంబమే బంగారుమయం అయ్యిందని విమర్శ

**సాక్షి, పెద్దపల్లి:** 'నేను పాదయాత్రలో ప్రతి గ్రామం చూస్తున్నా. ఏ ఒక్క ఇల్లు కూడా బంగారంలా కనిపించడం లేదు. అన్నీ గుడిసెలే కనిపిస్తున్నాయి. మరి సీఎం కేసీఆర్ చెబుతున్న బంగారు ఇళ్లు ఎక్కడున్నాయి? కేసీఆర్ తెలంగాణను బంగారం చేస్తే పేదలు ఇంకా గుడిసెల్లోనే ఎందుకు బతుకుతున్నారు? రాష్ట్రంలో నాలుగు కోట్ల ప్రజలకు చెందాల్సిన సంపదను నలుగురే దోపిడీ చేస్తున్నారు. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయమైంది. ఆయన తన ఇల్లు చూసుకుని రాష్ట్రంలో ప్రతి ఇల్లూ ఇలాగే ఉందని అనుకుంటున్నట్టుంది..' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం, పెద్దపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.

**రైతులు ఇబ్బందులు పడుతుంటే ఏం చేస్తున్నారు?**

ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని భట్టి ప్రశ్నించారు. రూ.1.25 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంతో ఉపయోగం ఏంటో సర్కారు సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకుండా జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి శివారులో కాలుష్య కారకమైన ఇథనాల్ కంపెనీ ఏర్పాటును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**ఇంకా రేకుల షెడ్లలోనే చదువులు..**

రూ.2.90 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో విద్యార్థులు ఇంకా రేకుల షెడ్లలో చదవడం ఏంటంటూ.. ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల దుస్థితిపై భట్టి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'మన ఊరు మనబడి' పథకం గొప్పగా తీసుకొచ్చామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం పాఠశాలల తరగతి గదుల నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖమంత్రి జిల్లాల్లో పర్యటించి వాస్తవ విషయాలు తెలుసుకుంటే బాగుంటుందని సూచించారు. ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయడానికి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలో కొస్తే విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని భట్టి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు, డీసీసీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నేతల బల ప్రదర్శన**

భట్టి పాదయాత్ర పెద్దపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించే పాలితం వద్ద కాంగ్రెస్ నేతలు బలప్రదర్శనకు దిగారు. మొదట విజయ రమణారావు ఆయనకు ఘన స్వాగతం పలకగా, అనంతరం ఓదెల జెడ్పీటీసీ గంట రాములు తన అనుచరులతో కలిసి స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తోపులాట చోటు చేసుకోవడంతో భట్టి జోక్యం చేసుకుని వారిని శాంతింపజేశారు.



భట్టి ముందే గొడవకు దిగుతున్న నాయకులు

# 25న బీఆర్ఎస్ జెండా పండుగ

- 19వేల జనావాసాల్లో ఎగురవేయాలి
- అదే రోజు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ప్రతినిధుల సభలు
- పార్టీ పనితీరుపై ఆ సభల్లో చర్చించుకోవాలి: మంత్రి కేటీఆర్



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ అభివృద్ధి, ప్రభుత్వ పరంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ పనితీరుపై ఈ నెల 25న జరిగే నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభల్లో చర్చించుకోవాలని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభలు పార్టీ నియమించిన ఇన్‌చార్జీలు, స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కొనసాగుతాయని, వాటి నిర్వహణను పార్టీ జిల్లా అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 25న రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల జనావాసాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని, అన్ని నియోజకవర్గాల్లో గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం పూట పండుగ వాతావరణంలో పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు స్థాయిలో జెండా పండుగ ముగిసిన తర్వాత ఉదయం 10 గంటలకు నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని ప్రతినిధుల సభకు హాజరుకావాలన్నారు.

**సమ్మేళనాల నివేదిక ఎప్పటికప్పుడు కేసీఆర్‌కు చేరుతోంది**

ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాల అమలు కమిటీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ తీరుతెన్నులపై పార్టీ అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తోందని కేటీఆర్ వెల్లడించారు. కాగా, ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసిన నేతలను కేటీ రామారావు ఈ సందర్భంగా అభినందించారు.

**కనీసం 3 వేల మందితో ప్రతినిధుల సభ**

కనీసం 3 వేల నుంచి 3500 మంది ప్రతినిధులతో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో సభ నిర్వహించాలని పార్టీ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు తీసుకోవాలనీ, సమావేశాలకు హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు భోజనాలు, ఇతర వసతులను సమకూర్చాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ గ్రామ, వార్డు శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీల డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లను ఆహ్వానించాలన్నారు. వీరితో పాటు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలను ఆదేశించారు.

## అటవీభూమిలో చట్టవిరుద్ధంగా ఈద్గా నిర్మాణం

- ఆ స్థలాన్ని ఒకేషనల్ సెంటర్‌కు కేంద్రం కేటాయించిందన్న బండి సంజయ్
- చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు లేఖ



**సాక్షి, హైదరాబాద్/నిర్మల్:** నిర్మల్ జిల్లా చించోలి(బి) పరిధిలోని సర్వేనంబర్లు 543, 544, 969లో ఉన్న అటవీభూమిని చట్టవిరుద్ధంగా ఈద్గాకు కేటాయించి నిర్మాణం చేపట్టారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్‌కు మంగళవారం లేఖ రాశారు. వృత్తి విద్యానైపుణ్యాల అభివృద్ధి కేంద్రం కోసం ఇవ్వాలని గతంలో రాష్ట్రప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు 3.373 హెక్టార్ల అటవీభూమిని కేంద్రప్రభుత్వం కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. అటవీభూములను సైతం డీనోటిఫై చేసిందే నిరుద్యోగుల భవిష్యత్తు కోసమని, అలాంటి భూమిని స్వార్థరాజకీయాల కోసం ఈద్గాకు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజాఉపయోగ కార్యక్రమాల కోసం ఉపయోగించాల్సిన భూములను ప్రార్థనాస్థలాలకు కేటాయించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కోర్టుతీర్పులకు వ్యతిరేకంగా ఈద్గాను నిర్మించడమంటే న్యాయవ్యవస్థను అవమానించినట్లేనన్నారు. ఈద్గా నిర్మాణానికి దగ్గరలోనే రెండు హిందూ ఆలయాలున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగుల కోసం కేటాయించిన భూమిని ప్రార్థనాస్థలాలకు ఇవ్వడంతోపాటు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును బలిచేసే చర్యలను బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వృత్తివిద్య, నైపుణ్యాల అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని అదే ప్రయోజనాల కోసం వినియోగించాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించడంతోపాటు ఆందోళనలకూ సిద్ధమవుతామని సంజయ్ హెచ్చరించారు.

## నిబంధనల ప్రకారమే 'ఈద్గా'

**సీఎంకు బండి సంజయ్ లేఖ రాయడాన్ని ఖండించిన మంత్రులు**



ఈద్గాను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్/సారంగపూర్:** నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) అటవీప్రాంతంలో నిబంధనల ప్రకారమే ఈద్గాను నిర్మించారని హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అటవీప్రాంతంలో పదెకరాల్లో రూ.5 కోట్లతో నిర్మించిన ఈద్గాను మంగళవారం సాయంత్రం మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ.. ఈద్గాపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎంకు లేఖ రాయడాన్ని ఖండించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హిందూ ముస్లింలను సమానంగా చూస్తూ గంగాజమునా తెహజీబ్‌ను కాపాడుతున్నారని తెలిపారు. అయితే.. చించోలి(బి) సమీపంలోని పదెకరాల స్థలం ఒకేషనల్ సెంటర్ కోసం ఇచ్చిందేనని, కానీ నిబంధనల ప్రకారమే ఈద్గాకు తీసుకున్నామని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. చెట్లు తీసేసినందుకు రూ.82 లక్షలు అటవీశాఖకు చెల్లించామన్నారు. ఈ స్థలానికి బదులుగా ముధోల్ నియోజకవర్గంలో అటవీశాఖకు 20 ఎకరాలు కేటాయించామని వివరించారు. ఒకేషనల్ సెంటర్ పనులనూ చేపడతామని ప్రకటించారు.

## ఇది యావత్ తెలుగు విద్యార్థులపై కుట్ర

- నా యూట్యూబ్ చానల్ హ్యాక్ చేశారు
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత



**పంజగుట్ట (హైదరాబాద్):** తన యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేయడం యావత్ తెలుగు విద్యార్థులపై జరిగిన కుట్ర అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత స్పష్టం చేశారు. ఆమె మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గత ఆదివారం తెల్లవారుజామున తన యూట్యూబ్ చానల్ హ్యాక్ అయినట్లు గుర్తించానన్నారు. తాను రెండు సార్లు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యానని, కానీ విద్యార్థులు, నిరుద్యోగులకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించానని వివరించారు. వారికి ప్రేరణ కలిగిస్తూ, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వీడియోలు చేసి అప్‌లోడ్ చేస్తున్నానని తెలిపారు. ఎంతోమంది గ్రామీణ విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు, హైదరాబాద్‌కు వచ్చి చదువుకోలేని వారికి, తెలుగులో తాను చేసిన వీడియోలు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. తన యూట్యూబ్ చానల్‌లో ఐదు లక్షల మంది వీక్షకులున్నారని తెలిపారు. తన వీడియోలు చూసి ప్రేరణ పొందిన ఎంతోమంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. మే 25న సివిల్ సర్వీసెస్ పరీక్షలు, జూన్‌లో యూపీఎస్సీ పరీక్షలున్న నేపథ్యంలో.. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వేలాదిమంది ఫోన్ చేసి అడుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హ్యాక్ చేయడమే కాకుండా అందులో గేమింగ్ వీడియోలు పెడుతున్నారని, ఏదైనా తప్పుడు సమాచారం పెడితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కేసును త్వరగా పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు విద్యార్థులు నిరాశకు గురికాకుండా వారికి ప్రేరణ, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారం ఇచ్చేందుకు 'BALA LATHA OFFICIAL'అనే కొత్త యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

**జిల్లా వార్తలు**

### నేడు మిర్చి కొనుగోళ్లకు సెలవు

**ఖమ్మంవ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అంచనాలకు మించి మిర్చిని రైతులు అమ్మకాలకు తీసుకొస్తున్నారు. సోమ, మంగళవారాల్లో భారీగా మిర్చి వచ్చిన నేపథ్యాన కాంటాలు, తరలింపు కోసం బుధవారం మిర్చి కొనుగోళ్లకు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు. ఇక గురువారం అమావాస్య సెలవు కాగా, తిరిగి శుక్రవారం మిర్చి కొనుగోళ్లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.


### కేటీపీఎస్‌కు నాణ్యమైన బొగ్గు అందించాలి



సింగరేణి డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈలు

**పాల్వంచ:** వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యాన కేటీపీఎస్ కాంప్లెక్స్‌కు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6, 7వ దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం వారు డైరెక్టర్లు ఎన్.వీ.కే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డిని కలిసి బొగ్గు సరఫరా చర్చించారు. డిమాండ్ దృష్ట్యా రైల్వే వ్యాగన్ల సంఖ్య పెంచాలని కోరగా డైరెక్టర్లు సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో కోల్ ప్లాంట్ ఎస్ఈ జి.రాజ్‌కుమార్, డీఈ ఎస్ఎంఎస్.శేఖర్, ఏడీఈ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### రామయ్యను దర్శించుకున్న స్పెషల్ కమిషనర్



ధ్వజస్తంభం వద్ద హరికిరణ్ దంపతులు

**భద్రాచలం:** భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరి హరికిరణ్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికాక, ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆతర్వాత ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనంతో పాటు స్వామి వారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం, సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు అగ్గి రాజు, గణేష్, రాంబాబు, రామరాజు పాల్గొన్నారు.

# మొబైల్ పోయిందా.. పట్టేద్దాం ఇలా!

- సీఐఆర్ పోర్టల్‌లోకి వెళ్తే 'బ్లాక్'కు అవకాశం
- ఆపై ట్రాకింగ్‌తో గుర్తింపునకు వెనులుబాటు
- వివరాలు వెల్లడించిన ఖమ్మం సీపీ వారియర్



**ఖమ్మంక్రైం:** ప్రస్తుత సమాజంలో అందరికీ సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. ఇదే సమయాన సెల్‌ఫోన్ దొంగతనాలు కూడా సర్వసాధారణమయ్యాయి. కొందరు పొరపాటుగా ఫోన్ పోగొట్టుకుంటుంటే.. మరికొందరి నుంచి దుండగులు అపహరిస్తున్నారు. ఈ నేపథ్యాన పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసేందుకు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పోర్టల్ సేవలు, వినియోగించుకునే విధానాన్ని ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మంగళవారం వెల్లడించారు.

**కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన..**

కేంద్రప్రభుత్వం టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన సీఈఐఆర్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే చోరీకి గురైన ఫోన్లను గుర్తించడంలో ఈ పోర్టల్ సేవలను పోలీసు శాఖ ఉపయోగించుకుంటోంది. ఈ పోర్టల్ సేవల కోసం తొలుత www.ceir.gov.in వైబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. అందులో బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్, అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ స్టేటస్ లింక్‌లు కనిపిస్తాయి. ఈమేరకు ఫోన్ పోగొట్టుకున్న వారు బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్ లింక్‌లోకి వెళ్లి మొబైల్ ఐఎంఈఐ నంబర్లు, కంపెనీ పేరు, మోడల్‌తో పాటు బిల్లు అప్‌లోడ్ చేయాలి. అలాగే, ఫోన్ ఏ రోజు, ఎక్కడ పోయింది, జిల్లా, రాష్ట్రం, పోలీస్ స్టేషన్ పరిధి వివరాలే కాక వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు, ఈమెయిల్, ఓటీపీ కోసం మరో మొబైల్ నంబర్ ఇవ్వాలి. ఇదంతా పూర్తయిన తర్వాత ఒక ఐడీ కేటాయిస్తారు. ఈ ఐడీ ద్వారా చెక్ రిక్వెస్ట్ స్టేటస్ లింక్‌లోకి వెళ్తే ఫిర్యాదు పరిస్థితిని తెలుసుకోవచ్చు.

**పోలీసులకు ఉపయోగం**

మొబైల్ ఏ కంపెనీదైనా సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేస్తే పోలీసు విచారణకు సులువుగా ఉంటుంది. ఫోన్ చోరీ చేసిన వారు ఎక్కడ ఉపయోగించినా ట్రాకింగ్ ద్వారా గుర్తించేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. అంతేకాక ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయడం ద్వారా చోరీ చేసిన వారు దాన్ని ఉపయోగించకుండా చూడొచ్చు. ఇక ఫోన్ దొరికాక మళ్లీ అదే ఐడీ నంబర్ ద్వారా సైట్‌లోని అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్ లింక్‌లోకి వెళ్తే మనం ఉపయోగించుకోవచ్చు.





సీఈఐఆర్ వెబ్‌సైట్ హోం పేజీ

**130 ఫోన్ల గుర్తింపు**



జిల్లాలో అందిన ఫిర్యాదులపై ఐఎంఈఐ సాయంతోనే కాక కాల్ డేటా రికార్డింగ్, ఇతర సాంకేతిక విధానాలను ఉపయోగించి సుమారు 130 ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించాం. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ఆ పరిధిలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఐఎంఈఐ ఆధారంగా దర్యాప్తు చేస్తారు. ఇక సీఈఐఆర్ వైబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తే త్వరగా ఫోన్‌ను దొరకబట్టడానికి అవకాశం లభిస్తుంది.

– విష్ణు ఎస్.వారియర్, ఖమ్మం పోలీసు కమిషనర్

## జాతీయస్థాయి పోటీల్లో పతకం

**కొత్తగూడెంఅర్బన్:** హెల్తీ సీనియర్ సిటిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగుపందెం పోటీల్లో భద్రాద్రి జిల్లాకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కృష్ణయ్య రజత పతకం సాధించారు. 75ఏళ్లు పైబడిన వారికి నిర్వహించిన పోటీల్లో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో కృష్ణయ్య తృతీయ స్థానంలో నిలవగా తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పతకం అందించి సన్మానించారు. ఈమేరకు కృష్ణయ్యను మంగళవారం కొత్తగూడెంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు వెంకట్, శ్రీనివాస్, సారంగపాణి, డాక్టర్ వెంకటేశ్వర్లు, మోహన్, కేహెచ్.ప్రసాద్, సుగుణరావు, వెంకటయ్య, రాజశేఖర్, ముస్తఫా అభినందించారు.



కృష్ణయ్యను సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

## కేయూ ఎల్ఎల్ఎం పరీక్షల షెడ్యూల్ విడుదల

**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 29 తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయి. అలాగే, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 28, మే 1వ తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు.

## అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలకు చెక్

**పాల్వంచ:** కర్మాగారాల్లో ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా ఉండడం ద్వారా అగ్నిప్రమాదాలు జరగకుండా కాపాడుకోవచ్చని పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలల సందర్భంగా మంగళవారం ఫైర్ ఆఫీసర్ యెడ్ల శ్రీనివాసులు ఆధ్వర్యాన మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఈ మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అవగాహన పెంపొందించుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీ.వీ.ధర్మారావుతో పాటు అధికారులు పి.కృష్ణ, పి.రామారావు, చంద్రశేఖర్, శేషసాయి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు

## కోలిండియా వేజ్‌బోర్డ్ సమావేశం వాయిదా

**సింగరేణి(కొత్తగూడెం):** కోలిండియా కార్మికులకు వేతనాలకు సంబంధించి 11వ వేజ్‌బోర్డ్ 9వ సమావేశం వచ్చే నెలకు వాయిదా పడింది. రెండు రోజుల పాటు నిర్వహిస్తామని ప్రకటించిన సమావేశం కోల్‌కత్తాలో మంగళవారం సమావేశం ప్రారంభమైంది. దీంతో బొగ్గు పరిశ్రమల కార్మికులు ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం అర్ధాంతరంగా మంగళవారమే ముగిసింది. ఇక 10వ సమావేశం నిర్వహణ తేదీని కూడా ప్రకటించకపోవడం గమనార్హం. కాగా, కోల్‌కత్తాలో జరిగిన సమావేశంలో చైర్మన్ అగర్వాల్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్(ఎంజీబీ) 19శాతం పెంచగా, కేంద్రప్రభుత్వం ఆమోదించాల్సి ఉందని తెలిపారు. ఇక ఎంబీబీ పెంచిన నేపథ్యాన ఇతర అలవెన్స్‌లు పెంచలేమని చెప్పగా, మస్టర్లతో సంబంధం లేకుండా బోనస్, స్పెషల్ డీఏ కొనసాగింపు, బేసిక్‌పై 3శాతం ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. అలాగే, ఓవర్ టైమ్(ఓటీ) సీలింగ్ అండర్ గ్రౌండ్ వారికి తొలగిస్తామని పేర్కొనడమే కాక అండర్ గ్రౌండ్, నైట్‌షిఫ్ట్, చార్జింగ్, నర్సింగ్ అలవెన్స్‌లపై పలు నిర్ణయాలు వెలువరించారు. ఈసమావేశంలో కోలిండియా డైరెక్టర్(పా) వినయ్ రంజన్, సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్, జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి, ఏజీఎం పర్సనల్ కవితానాయుడు, కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్ బలరామ్, జీఎం కుమార్‌రెడ్డి

## 'సదరం'లో దివ్యాంగుల అవస్థలు

**మూడు గంటల ఆలస్యంగా వచ్చిన వైద్యులు**

**సత్తుపల్లిటౌన్:** నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసేందుకు మంగళవారం సత్తుపల్లిలో శిబిరం ఏర్పాటుచేశారు. అయితే, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులు వివిధ ప్రాంతాల నుంచి ఉదయం 9 గంటలకల్లా చేరుకున్నారు. కానీ వైద్యులు 12 గంటల వరకు రాకపోవటంతో నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కనీసం అల్పాహారం కూడా ఏర్పాటు చేయకపోవటంతో శిబిరం ముగిశాక ఆకలితోనే మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటి ముఖం పట్టాల్సి వచ్చిందని వాపోయారు. కాగా, ఈ శిబిరంలో 110 మందికి వైద్యులు పరీక్షలు చేయగా, 81మంది సర్టిఫికెట్లకు అర్హులుగా నిర్ధారించారు. క్యాంప్ ఇన్‌చార్జ్ వినయ్‌కుమార్, వైద్యులు హనుమాన్, వెంకటనర్సయ్య, రాంమూర్తి, పవన్, జ్యోతి, ఆదర్శ్, ప్రసన్నకుమార్, నరేష్, సిబ్బంది కిషన్, వీరయ్య పాల్గొన్నారు.



శిబిరంలో రిపోర్టులు పరిశీలిస్తున్న వైద్యులు

## ఎస్సెస్సీ 'స్పాట్' కేంద్రంలో తనిఖీ

**ఖమ్మం సహకారనగర్:** ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్ వాల్యుయేషన్) జరుగుతుండగా పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్, స్పాట్ వాల్యుయేషన్ జిల్లా పరిశీలకులు శ్రీనివాసచారి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేదీ వరకు వాల్యుయేషన్ పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాకు 2.16లక్షల జవాబుపత్రాలు రాగా, 1.40లక్షల జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయిందని, మిగతావి కూడా గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కూడా టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారని డీఈఓ తెలిపారు.

## బకాయిల వసూళ్లపై దృష్టి

**హన్మకొండ:** విద్యుత్ బిల్లులకు సంబంధించి మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అధికారులకు సూచించారు. హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈఈలు, ఎస్ఏఓలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ రూ.50 వేలకు పైబడిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీటర్ రీడింగ్ తరచుగా తనిఖీ చేస్తూ అంతరాయాలు తగ్గించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, అధికారులు కిషన్, అశోక్‌కుమార్, సదర్‌లాల్, బీకంసింగ్, మధుసూదన్, నరేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సీఎండీ గోపాల్‌రావు